'ప్రత్యేక ఓటరు సవరణ'ను
పకడ్బందీగా నిర్వహించాలి

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం, ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ నెల ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 1095 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,72,858 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించినట్లు చెప్పారు. అలాగే 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో ఫారం 6 ద్వారా 1149, ఫారం 7 ద్వారా 382, ఫారం 8 ద్వారా 860 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం ఫారం 6,7,8లకు 59,658 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 47,612 దరఖాస్తులు విచారణ ప్రక్రియ పూర్తి కాగా, 4,454 దరఖాస్తులు తిరస్కరించారని, 7,589 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నట్లు చెప్పారు. వచ్చేనెల 6వ తేదీ డేటా ప్రక్రియ పూర్తి చేసి 8వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి సంబంధించి తుది ఓటరు జాబితా రూపకల్పన చేయనున్నట్లు ఆమె వివరించారు. జిల్లాలో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 14,075 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, అలాగే 18-19 సంవత్సరాల

ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి

మాట్లాడుతున్న బాలమాయాదేవి, పక్కన కలెక్టర్

వయస్సు ఉన్న ఓటర్లు 27,490 మంది, 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 13,106 మంది ఉన్నట్లు చెప్పారు., అశ్వారావుపేట నియోజకవర్గంలోని 8 హాబిటేషన్లలో ఉన్న అర్హులైన కొండరెడ్లు 692 మందికి ఓటుహక్కు నమోదు చేసినట్లు చెప్పారు. 1,950 కంట్రోల్ రూమ్‌కు, ఎన్‌జీఆర్ఎస్ పోలర్టల్కు వచ్చిన ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదుపై ఫజర్యాదులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగింపునకు ఫారం 7 జారీ చేస్తున్నామన్నారు. నోటీసులు జారీ చేసిన 7రోజుల తర్వాత తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరణించిన వ్యక్తుల మరణ ధ్రువీకరణ ఆధారంగా అందుబాటులోని సందర్భంలో కుటుంబ సభ్యులు వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకొని తొలగిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవోలు శిరీష, మంగీలాల్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా జరగాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 29 : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయని, మొదటి సంవత్సరం 10,200 మంది, ద్వితీయ సంవత్సరం 9,277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పరీక్షాకేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. 16 పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నాపత్రాలను భద్రపర్చనున్నట్లు చెప్పారు. 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36మంది శాఖాపరమైన అధికారులు, 13మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, ఐదు కస్టోడియన్స్‌ను నియమించామన్నారు. 550 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించామని, పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, డీఆర్వో రవీంద్రనాథ్, డీపీవో రమాకాంత్, డీఎంహెచ్‌వో శిరీష, డీఈవో వెంకటేశ్వరచారి, విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేశ్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 29: భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.30కోట్లతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక తొడుగులను ధరింపజేశారు. అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ జరిపి, నిత్య పూజలు యధావిధిగా నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో స్వామి వారికి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

జీయర్ మఠంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భద్రాచలం, జనవరి 29: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి ఇంటర్మీడియేట్ బ్యాచ్ (1969-71) విద్యార్థులు సోమవారం స్థానిక చిన జీయర్ మఠంలో కలుసుకున్నారు. నాడు ఆడిన ఆటలు, చేసిన అల్లరి గుర్తు చేసుకొని సంతోషంగా రోజంతా గడిపారు. గోళ్ల భూపతిరావు, యార్లగడ్డ హనుమంతరావు, చారుగుళ్ల వెంకట నాగభూషణం, సత్యనారాయణరెడ్డి, వెంకట నరసయ్య, ఆంజనేయ వర్మ, అప్పారావు, సుబ్బారావు, శంకరరావు, రమణారెడ్డి, కృష్ణకుమార్, రాంబాబు, నానాజీ, ఉదయభాస్కర్, ప్రభాకర్, పటేల్, పద్మజ, శారద, వెంకటమ్మ, విజయలక్ష్మి, సీత పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

భద్రాచలం, జనవరి 29: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్సైలు వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

టేకులపల్లి, జనవరి 29: 108 వాహనంలో గర్భిణి ప్రసవించింది. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన శ్రావణికి సోమవారం తెల్లవారు జామున పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేయగా సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది ఎంసీహెచ్ రామవరానికి రిఫర్ చేయగా రామవరం ఆస్పత్రి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ అశోక్, ఈఆర్‌సీపీ డాక్టర్ మనీష్ సూచనలతో సుఖ ప్రసవం చేశారు. తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. కుటుంబీకులు 108 సిబ్బంది, ఈఎంటీ అశోక్, పైలట్ వేణుకుమార్‌ను అభినందించారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

భద్రాచలం, జనవరి 29 : ప్రభుత్వ పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని, ఈ విషయంలో యూనిట్ అధికారులు చొరవ చూపాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పాల్గొన్న ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలో ఉన్న వాటిని వెనువెంటనే పరిష్కరిస్తూ.. మిగతా వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా పోడు భూముల సమస్యలు, రైతుబంధు రుణాలు, పోడు పట్టాలు, వ్యవసాయ మోటర్లు, ట్రైకార్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, గురుకుల ఆర్సీవో వెంకటేశ్వరరాజు, ఎస్వో సురేశ్, ఏపీవో పవర్ మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

బైండోవర్ ఉల్లంఘన.. రూ.55వేల జరిమానా

టేకులపల్లి, జనవరి 29: గతంలో నాటు సారా తయారుచేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడి బైండోవరు అయిన నిందితురాలికి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కే కృష్ణవేణి సోమవారం రూ.55 వేలు జరిమానా విధించారు. ఇల్లెందు ఎక్సైజ్ సీఐ బీ రాంప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ప్రేగళ్లపాడు గ్రామ పంచాయతీ తూర్పుగూడెం గ్రామానికి చెందిన అంగోత్ సునీత గతంలో నాటు సారాయి తయారుచేస్తుండడంతో మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట ఎక్సైజ్ అధికారులు హాజరుపర్చడంతో సత్ప్రవర్తన కలిగి ఉంటానని తెలుపగా బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి నాటు సారా, ముడి సరుకులతో పట్టుబడడంతో ఎక్సైజ్ ఎస్సై రమాదేవి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చడంతో సునీతకు రూ.55వేలు జరిమాన విధించారు. కార్యక్రమంలో ఎస్సై రమాదేవి, సిబ్బంది రవిబాబు, ఎస్కే బాబా, యాకుబ్‌పాషా, మల్లికార్జున్, చారి, తులసిరామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధుల వినతి

ములకలపల్లి, జనవరి 29: మండలంలోని కురుమలు గొర్రెల కోసం డీడీలు తీసి ఏళ్లు గడవడం వల్ల అధిక వడ్డీలు కడుతున్నారని ఎమ్మెల్యే జారె ఆదినారాయణను సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అశ్వారావుపేటలో మొత్తం 1320 మంది డీడీలు కట్టామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని కలెక్టర్‌ను కలిసి వివరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సున్నం సుధాకర్, జబ్బూరి అక్కులు, అచ్చన వెంకటేశ్వర్లు, అచ్చన రాంబాబు, గొల్ల కురుమలు ఉన్నారు.

సీపీఆర్‌తో వృద్ధుడిని కాపాడిన కానిస్టేబుల్

అశ్వారావుపేట, జనవరి 29: దైవ దర్శనానికి వచ్చి గుండెపోటుకు గురైన ఒక వృద్ధుడి ప్రాణాలను కానిస్టేబుల్ కాపాడాడు. అశ్వారావుపేట మండలం పాకలగూడెం గ్రామానికి చెందిన తోట నాగముత్యం దమ్మపేట పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. సమ్మక్క-సారక్క జాతర బందోబస్తు నిమిత్తం మేడారంలో విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మారెడ్డి సమ్మక్క-సారక్క జాతరకు వచ్చి గుండెపోటుకు గురి కావడంతో విధి నిర్వాహణలో ఉన్న కానిస్టేబుల్ నాగముత్యం వెంటనే స్పందించి సీపీఆర్ చేసి స్పృహలోకి తీసుకొచ్చాడు. బంధువుల సహకారంతో సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మారెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని నాగముత్యం తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న అశ్వారావుపేట సీఐ కరుణాకర్, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్‌రెడ్డి, తోటి సిబ్బంది, భక్తులు కానిస్టేబుల్‌ను ప్రశంసించారు.

గంజాయి పట్టివేత

సీజ్ చేసిన గంజాయితో ఆబ్కారీ అధికారులు

కొత్తగూడెం క్రైం, జనవరి 29 : కొత్తగూడెం బస్టాండ్ ఆవరణలో సోమవారం ఆబ్కారీ అధికారులు రూ.5.25 లక్షల విలువైన 21.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ బస్తాని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో గంజాయిని సీజ్ చేసినట్లు కొత్తగూడెం ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్. జయశ్రీ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై గౌతం, సిబ్బంది హబీబ్‌పాషా, రామకృష్ణ, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్‌లో చోరీ

కొత్తగూడెం సింగరేణి, జనవరి 29 : సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ఛమన్‌బస్తీలో ఉన్న సింగరేణి క్వార్టర్(డీఏ 100)లో తలుపులు, రేకులు చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కార్మికులకు కేటాయించే ఈ క్వార్టర్లలో ఖాళీగా ఉన్న వాటి తలుపులు, పైకప్పు రేకులు, ఇనుప సామగ్రిని దొంగిలించడం పరిపాటిగా మారింది. ఛమన్‌బస్తీలో ఉన్న డీఏ 100 క్వార్టర్ పొందిన కార్మికుడు దానిని శుభ్రం చేసేందుకు సోమవారం వెళ్లాడు. క్వార్టర్ వెనుక భాగాన ఉన్న రేకులు, తలుపులు, కిటికీలు చోరీకి గురైన విషయాన్ని గుర్తించి సింగరేణి క్వార్టర్ల పర్యవేక్షించే అధికారికి ఫిర్యాదు చేశాడు.

'పంచాయతీ' రాష్ట్ర కార్యదర్శిగా గోపాలరావు

జూలూరుపాడు, జనవరి 29 : తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘం) రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఏదులాపురం గోపాలరావు ఎన్నికయ్యారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహాసభలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం సమక్షంలో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

బ్రోచర్ విడుదల

ఇల్లెందు, జనవరి 29: 2024-2025 విద్యా సంవత్సరానికి మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర అడ్మిషన్ల కోసం ప్రిన్సిపల్ మదస్సార్ హుస్సేన్ ఆధ్వర్యంలో డీఎస్పీ రమణమూర్తి సోమవారం ఆయన కార్యాలయంలో బ్రోచర్ విడుదల చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
కావలెను
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SHRIRAM Finance Limited WANTED
మార్కెటింగ్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ భద్రాచలం మరియు కొత్తగూడెం నందు కావలెను.
అర్హతలు : 1). డిగ్రీ పాసై ఉండాలి, వయస్సు : 25సం॥లోపు ఉండవలెను. 2) బైక్ తప్పని సరిగా ఉండాలి. 3) జీతం : నెలకు 15000/- ప్లస్ ఇన్సెంటివ్స్.
Interview Date 30.01.2024, 31.01.2024 & 01.02.2024
ఆఫీస్ చిరునామా : RMR ప్లాజా, 1st ఫ్లోర్, MG Road కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
ఆసక్తి గల వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
బ్రాంచ్ మేనేజర్ : 9642842657, 8978380080, డివిజనల్ మేనేజర్ : 8978380079

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రూ.1.6 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

దమ్మపేట రూరల్, జనవరి 29: మండలంలోని మందలపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం వీడ్కోలు సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో పంచాయతీలోని మిగులు నిధులు, ఎంపీ లాడ్స్, సీడీపీ, ఉపాధిహామీ నిధులతో 30 రోడ్లను రూ.1.6 కోట్లతో నిర్మాణాలు జరిగాయని పాలక వర్గ సభ్యులు పేర్కొన్నారు. డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, పారిశుద్య కార్యక్రమాలు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానాలు, సమిష్టి నిర్ణయాలతో చేసుకున్నామన్నారు. ప్రజలు ఎన్నికలు లే కుండా ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని ఎన్నుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని అన్నారు. సర్పంచ్ మడివి దుర్గ, ఉపసర్పంచ్ గార పాటి సూర్యనారాయణ, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో రామారావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెచ్చా పరామర్శ

చంద్రుగొండ, జనవరి 29: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల రావికంపాడు గ్రామానికి చెందిన కుక్కల శ్రీనివాసరావు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా చ్చారు. తొలుత శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వర రావు, నాయకులు మేడా మోహన్‌రావు, భూపతి రమేశ్, మద్దిరాల చిన్నపిచ్చయ్య, కొదుమూరి జనార్దన్‌రావు, ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఎలుగుబంటి దాడి

చంద్రుగొండ, జనవరి 29: వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకున్నది. అటవీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దుకూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి నల్లమోతు రామారావు సోమవారం ఉదయం వాకింగ్ చేసేందుకు గ్రామశివారులోని మద్దుకూరు ప్రాజెక్టు కట్టపై నడుస్తుండగా అకస్మాత్తుగా వెనుకనుంచి ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో రామారావు తీవ్రంగా గాయపడడంతో కుటుంబసభ్యులు విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రామారావు ఆరోగ్యంగా నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎలుగుబంటి దాడి చేసిన మద్దుకూరు ప్రాజెక్టు కట్టను చంద్రుగొండ ఫారెస్టు రేంజర్ ఎల్లయ్య సోమవారం సందర్శించారు. ఎలుగుబంటి కనపడితే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

చోరీ ఘటనపై ఫిర్యాదు

పర్ణశాల, జనవరి 29: మండలంలోని సుజ్ఞానపురం గ్రామానికి చెందిన సోమ్లా భూషణ్ తన ఇంట్లో చోరీ జరిగినట్లు సోమవారం దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం అశ్వాపురం వెళ్లి సోమవారం ఇంటికి రాగా తలుపు తాళాలు పగులగొట్టి ఉండడం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న రూ.1.10 లక్షల నగదు, విలువైన వస్తువులు పోయాయని ఫిర్యాదు చేశాడు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

అవిశ్వాస సమావేశానికి బందోబస్తు కల్పించాలి

ఇల్లెందు, జనవరి 29: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై ఫిబ్రవరి 5న జరుగు అవిశ్వాస తీర్మానంపై నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి బందోబస్తు కల్పించాలని ప్రత్యేక క్యాంపులో ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు చేసిన లేఖలను జిల్లా కలెక్టర్, ఎస్పీకి సోమవారం అందజేశారు. చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా 19మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాస నోటీసుల ఇచ్చారు. ఫిబ్రవరి 5న ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక నోటీసు ఇచ్చారు.

వృక్ష మిత్రలు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

అశ్వారావుపేట, జనవరి 29: స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్న వృక్ష మిత్రలు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి అసోషియేట్ డీన్ డాక్టర్ ఐవీఎస్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన వృక్ష మిత్రలకు కొబ్బరి అభివృద్ధి బోర్డు సౌజన్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం కొబ్బరి చెట్లు ఎక్కే ఆధునిక యంత్రాలతో పాటు నైపుణ్య శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ డీ నాగాంజలి, డాక్టర్ రమేశ్, డాక్టర్ పావని, ఏవో జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

ములకలపల్లి, జనవరి 29: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఎస్సై రాజమౌళి విద్యార్థులకు సూచించారు. ములకలపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, చరవాణిల వాడకంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ అధికంగా వాడటం, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ డీపీల్లో పర్సనల్ ఫోటోలను పెట్టడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సిస్టర్ నిర్మల, హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

అశ్వారావుపేట, జనవరి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అంతర్రాష్ట్ర క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. కళాశాలలో హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఊకే బాబూరావు, ప్రథమ సంవత్సరం చదువుతున్న తెల్లం స్వప్నం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు నిర్వహించిన అంతర్రాష్ట్ర జూనికర్ కళాశాల తరుపున క్రీడల్లో పాల్గొన్నారు. బాబూరావు లాంగ్ జంప్, రన్నింగ్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, స్వప్న చెస్‌లో తృతీయ స్థానాల్లో నిలిచి మెడల్స్ సాదించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ సాగర్, బోధనా సిబ్బంది అభినందించారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

అన్నపురెడ్డిపల్లి, జనవరి 29: బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని కేజీబీవీ స్పెషలాఫీషర్ పీ కవిత అన్నారు. సోమవారం కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల కొత్తగూడెంలో జరిగిన కరాటే పోటీల్లో 23 బంగారు, 3 వెండి, 4 రజత పతకాలు సాధించి ఓవరాల్‌గా చాంపియన్‌షిప్ కప్ పొందడం సంతోషంగా ఉందన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

రామవరం, జనవరి 29: బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న టెన్త్ విద్యార్థులకు జమాతే ఇస్లామీ హింద్ సభ్యుడు షేక్ అబ్దుల్ బాసిత్ సోమవారం అల్పాహారం అందజేశారు. హెచ్ఎం మధురవాణి, గౌరు భరత, కాంతి రేఖ, గౌరు శాన్వీ, కౌలీని, టీచర్లు దస్తగిరి, తారాచంద్, బాలాజీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ములకలపల్లి, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన మండలంలోని కంపగూడెం క్రాస్‌రోడ్‌లో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఎస్సై రాజమౌళి తెలిపిన వివరాల ప్రకారం...పూసుగూడెం పంచాయతీ ఒడ్డు రామవరం గ్రామానికి చెందిన పద్దం వంశీ (22), పద్దం విష్ణు (24) ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై ఆదివారం మండలంలోని రాజాపురం, ముత్యాలపాడు గ్రామాల్లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున ఇంటికి వస్తుండగా కంపగూడెం క్రాస్‌రోడ్ సమీపానికి రాగానే వాహనం అదుపుతప్పి కిందపడడంతో వంశీ, విష్ణులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రాజమౌళి, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని మహిళ..

దమ్మపేట రూరల్, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని గణేశ్‌పాడు క్రాస్ రోడ్డులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన గంజి కరుణ (30) భర్త కాళిదాసుతో కలిసి ద్విచక్ర వాహనంపై సత్తుపల్లి వెళ్తుడంగా గణేశ్‌పాడు క్రాస్ రోడ్డు సమీపంలో వెనక నుంచి లారీ ఢీకొనడంతో కరుణ అక్కడికక్కడే మృతి చెందింది. కాళిదాసుకు గాయాలయ్యాయి. కాళిదాసు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారం అందాలి

మణుగూరు టౌన్, జనవరి 29: బాలింతలు, శిశువులకు పౌష్టికాహారం అందాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీడీపీవో అధికారులతో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా 164 కేంద్రాలకు పైగా ప్రయోజనం చేకూరనున్నదని, సంబంధిత ధ్రువపత్రాలను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. అంగన్‌వాడీలు ఎమ్మెల్యే పాయంను సన్మానించారు. జిల్లా అధికారి విజేత, సీడీపీవోలు జయలక్ష్మి, తారా, సీతారామ, రేవతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దేవదాస్‌కు సన్మానం

భద్రాచలం, జనవరి 29: భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్ బెస్ట్ ప్రిన్సిపాల్‌గా కలెక్టర్ నుంచి అవార్డు తీసుకున్నారు. ఆయనను అధ్యాపకులు, సోమవారం సత్కరించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కొత్తగూడెం టౌన్, జనవరి 29 : విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వేలాదిమంది విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి ప్రవేశించాలని చూడడంతో విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.7,800 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో భూపేందర్, బయ్యా అభిమన్యు, సందీప్, అభిమిత్ర, మంద నాగకృష్ణ, శరత్, రాంచరణ్, ప్రవీణ్, పవన్, చరణ్, భవాని, సుధీర్, సాగర్, నిఖిల్, ప్రణయ్, వర్ధన్ పాల్గొన్నారు.

సదరం క్యాంపులకు స్లాట్‌బుక్ చేసుకోవాలి

కొత్తగూడెం అర్బన్, జనవరి 29 : జిల్లాలోని దివ్యాంగులు సదరం క్యాంపుల కోసం ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు సోమవారం ప్రకటనలో తెలిపారు. శారీరకలోపం, బుద్ధిమాంద్యం ఉన్నవారు 480 మందికి ఫిబ్రవరి 3, 7, 21, 24 తేదీలు, మార్చి 2, 6, 20, 23 తేదీల్లో, దృష్టిలోపం, వినికిడి లోపం ఉన్న 240 మందికి ఫిబ్రవరి 14, 28 తేదీలు, మార్చి 13, 27 తేదీల్లో సదరం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

కొత్తగూడెం టౌన్, జనవరి 29 : మహాత్మాగాంధీ వర్ధంతి, కుష్ఠు నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 30 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు కుష్ఠువ్యాధిపై గ్రామాల్లో అవగాహన సభలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష తెలిపారు. గత ఏడాది ఆగస్టులో గుర్తించిన 32 మందికి మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మెడికల్ సిబ్బందితోపాటు ప్రజలు భాగస్వాములై కుష్ఠురహిత సమాజం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు.

పెద్దమ్మ తల్లికి కొత్వాల ప్రత్యేక పూజలు

పాల్వంచ రూరల్, జనవరి 29 : మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు కొత్వాలకు ఆశీర్వచనం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

గణపయ్య ఆలయంలో చిచ్చు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : దైవ సన్నిధిలో పెత్తనం కోసం పూజార్లు, ఈవో మధ్య చిచ్చు రగులుతున్నది. జిల్లా కేంద్రంలోని విజయ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కొంతకాలంగా నడుస్తున్న ఈ వ్యవహారం సోమవారం మరోసారి బహిర్గతమైంది. సంకటహర చతుర్థి నాడు ఆలయంలో పూజార్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. దీంతో ఆలయ ఈవో సులోచన అయ్యావార్లను పిలిచి ప్రశ్నించగా ఈవోపై తిరగబడ్డారని తెలిసింది. కొద్దిసేపు అయ్యావార్లకు ఈవోకు మధ్య వాగ్వివాదం జరిగింది. దీనిపై ఈవోను 'నమస్తే' వివరణ కోరగా ఉదయం 11గంటలు దాటినా పూజార్లు రాలేదని, అడిగితే తిరగబడ్డారని తెలిపారు.

జాతీయ కబడ్డీ టోర్నీ టెక్నికల్ అఫీషియల్‌గా నరేశ్

జూలూరుపాడు, జనవరి 29 : రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో జరిగే జాతీయ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు టెక్నికల్ అసిస్టెంట్ అఫీషియల్‌గా మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన కూరాకుల నరేశ్ ఎంపికయ్యారు. ఆయనను జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి స్వాతిముత్యం అభినందించారు.

ఎన్పీడీసీఎల్ డీఈకి అవార్డు

భద్రాచలం, జనవరి 29: పట్టణంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌ఛార్జి డీఈగా, మణుగూరులో ఏడీఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న కే జీవన్‌కుమార్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా వరంగల్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎండీ చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డును అందుకున్నారు. ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, మోహన్‌రెడ్డి, గణపతి, సంధ్యారాణి, ఇతర ఉన్నతాధికారులు, పట్టణ ప్రముఖులు, ఏడీఈ, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న జీవన్‌కుమార్